COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 5 ఆగస్టు, 2023.

# అసైన్డ్ భూములపై ప్రభుత్వ ఆర్డినెన్సు ఉపసంహరించుకోవాలి

భూమి లేని గ్రామీణ పేదలు, దళితుల అభ్యున్నతి, ఆత్మగౌరవం, జీవనోపాధి కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వమే అమ్ముకోవచ్చని ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటి తీవ్రంగా ఖండిస్తున్నది. అసైన్డ్ చట్ట సవరణపై అన్ని రాజకీయ, వ్యవసాయ కార్మిక, దళిత సంఘాలతో చర్చించిన తర్వాతనే ముందుకు వెళ్ళాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఆర్డినెన్స్ ఉపసంహరించుకోవాలి. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల వివరాలు గ్రామ సచివాలయంలో బహిరంగ పరచాలి. రానున్న నెల రోజుల్లోపు అసెంబ్లీ సమావేశాలు ఉండగా ఆగమేఘాలపై ఎవరి ప్రయోజనాల కోసం ఆర్డినెన్స్ తీసుకురావాల్సి వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కనీసం చర్చించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నది. ఈ నిర్ణయం చూస్తుంటే దళితులు, ఇతర పేదలకిచ్చిన అసైన్డ్ భూములను పెత్తందార్లకు కట్టబెట్టడానికే 9/77 చట్టాన్ని సవరించారు. తక్షణమే ఆర్డినెన్స్ ఉపసంహరించుకోవాలి. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. రెండున్నర ఎకరా మాగాణి, 5 ఎకరాల మెట్ట ఉన్న రైతులు అసైన్డ్ భూములు కలిగి ఉంటే వారిని మినహాయించాలి.

మన రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళనల ఫలితంగా సుమారు 32 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగింది. ఇందులో సుమారు 15 లక్షల ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైనట్లు కోనేరు రంగారావు భూ కమిటి చెప్పింది. ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూమిని అనేక చోట్ల భూస్వాములు, పలుకుబడి కలిగిన వారు పారిశ్రామిక కేంద్రాలు, ఆక్వా చెరువులు, విద్యాలయాలు, నేషనల్ హైవేలు, విమానాశ్రయాలు ప్రక్కనున్న దళితులకు చెందిన అసైన్డ్ భూములను దౌర్జన్యంగా లాక్కున్నారు. కొన్ని చోట్ల పేదల యొక్క బలహీనతను ఉపయోగించుకొని పావలో, పాతికో ఇచ్చి తమ భూములు ప్రక్కన కలిపేసుకున్నారు. ఇటువంటి అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఆ పేదలకే ఇవ్వాలని 9/77 చట్టం చెబుతుంది. ఈ చట్టం ఉండబట్టే భూములు కోల్పోయిన పేదలు పోరాడి లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి తిరిగి పొందుతున్నారు.

నేడు వైసిపి ప్రభుత్వం ఈ భూములను కార్పొరేట్ కంపెనీలకు, రియల్టర్లకు, భూస్వాములకు కట్టబెట్టడానికే చట్ట సవరణ చేసి గవర్నర్ ద్వారా జూలై 31న ఆర్డినెన్స్ తెచ్చారు. సవరించిన సెక్షన్ 3లో అసైన్డ్ భూమి మాస్టర్ ప్లాన్ ప్రక్కన వ్యవసాయేతర అవసరాల కోసం (పరిశ్రమలు, విద్యాలయాలు, ఆక్వా, ఇతరములు) ఆక్రమించుకున్నట్లయితే ఆ భూములకు మార్కెట్ రేట్ ప్రకారంగా అసైన్డ్‌దారులకు డబ్బు చెల్లించాలని సవరణ చేశారు. ఈ సవరణ ద్వారా ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములను ఇలాంటి తప్పుడు పద్ధతుల పేరుతో పేదల భూములను రాజమార్గంలో కొట్టేయడానికి భూస్వాములకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దురాక్రమణ చేసిన ఆక్వా, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు పెట్టని ఖాళీ కంపెనీ భూములను అసలు అసైన్డ్‌దారుల పరం చేయాలి. పేదలు పొందిన అసైన్డ్ భూములను అభివృద్ధి చేసుకొని వారి జీవితాలు, వారి పిల్లల భవిష్యత్ అభివృద్ధి చేసుకోవడానికి పెట్టుబడి, సాగునీటి సౌకర్యం, పరపతి సౌకర్యం కల్పించి అభివృద్ధి చేయాల్సింది పోయి భూములు అమ్ముకోమని ప్రోత్సాహించడం అభివృద్ధి నిరోధక చర్య. ప్రభుత్వం తెచ్చిన సవరణ అసైన్డ్ భూముల హక్కుదారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములకు మేలు చేయడానికే పిఓటి యాక్ట్ 9/77 చట్టాన్ని సవరించారు.

(వి.శ్రీనివాసరావు)
రాష్ట్ర కార్యదర్శి